క్లుప్తంగా

డిప్యూటీ సీఎంను సన్మానించిన నాయకులు



నవాబుపేట: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. శనివారం ఆయన జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులను ఆయన పేరుపేరున పలకరించటంతో సంబరపడ్డారు. బంగ్లారవి, మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, రాజేష్, శ్రీహరి, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి



మిడ్జిల్: బ్యాంకులలో కల్పించిన అన్ని రకాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణా వికాస్ బ్యాంకు రీజనల్ సీనియర్ మేనేజర్ గోపాల్‌రెడ్డి సూచించారు. శనివారం దోనూర్‌లో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సమావేశం నిర్వహించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన గొరిగె శివలింగం బ్యాంకులో రూ. వేయి చెల్లించి బీమా చేయగా... ఇటీవల మరణించడంతో అతడి భార్య లక్ష్మమ్మకు మంజూరైన రూ. 20 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ గోవర్ధన్, బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్, పెరుమాల్, సురేష్‌రెడ్డి, గోపి, కృష్ణ, రవి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

గోవులకు రక్షణ కల్పించాలి



చిన్నచింతకుంట: గోవధ నిషేధాన్ని అమలు చేస్తూ.. గోవులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని బజరంగ్‌దళ్ నాయకుడు కల్యాణ్ అన్నారు. శనివారం ఈ మేరకు బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు ఎస్ఐ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కొందరు అక్రమార్కులు గోవులను కబేళాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వృద్ధులపై వేధింపులు అరికట్టాలి



నవాబుపేట: వృద్ధులపై వేధింపులు అరికట్టి వారికి ప్రత్యేక సదుపాయలు కల్పించాల్సిన అవసరం ఉందని సీనియర్ సిటిజన్‌ల ఫోరం జిల్లా ప్రధానకార్యదర్శి నాగభూషణం కోరారు. శనివారం ఫోరం మండల అధ్యక్షుడు నర్సింహులు ఆధ్వర్యంలో.. వేధింపుల నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ నాన్యనాయక్‌కు వినతిపత్రం అందించారు. ఫోరం నాయకులు చంద్రశేఖర్, వెంకటేశ్వరప్ప, చిన్నస్వామి, పండరీనాథ్, విజయ్‌కుమార్, ఆనందం, వెంకటయ్య, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

నెరవేరిన చిరకాల స్వప్నం



స్టేషన్ మహబూబ్‌నగర్: వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు ఉన్నతీకరణతో 24 ఏళ్ల చిరకాల స్వప్నం నెరవేరిందని.. ఆ సంఘం (టీజీపెటా) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దూమర్ల నిరంజన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఆకాంక్ష తీర్చినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ దేవసేనకు కృతజ్ఞతలు తెలిపారు. పీఈటీల ఉన్నతీకరణ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డిని తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో శుక్రవారం రాత్రి ఘనంగా సన్మానించారు. టీజీపెటా జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు ఆనంద్‌కుమార్, కోశాధికారి మొగులాల్, మొయిన్, వినోద్‌కుమార్, శ్రీనివాసులు, నాగరాజు, శంకర్, రాములు, రవి, భానుకిరణ్, రఘు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కూలడానికి సిద్ధంగా పాఠశాల



ప్రహరీ లేకపోవడంతో పాటు శిథిలావస్థకు చేరిన కుచ్చర్‌కల్ ప్రాథమికోన్నత పాఠశాల

- అధ్వానంగా మారిన కుచ్చర్‌కల్ బడి పరిస్థితి
- విద్యార్థులను పంపేందుకు జంకుతున్న తల్లిదండ్రులు

రాజాపూర్: మండల పరిధిలో పలు ప్రభుత్వ పాఠశాలల భవనాల పరిస్థితి నానాటికి తీసికట్టుగా తయారవుతోంది. బడుల అభివృద్ధి ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలు వంటి కార్యక్రమాలు చేపట్టినప్పటికీ చాలా చోట్ల ఆ ప్రభావం అంతంతగానే కనిపిస్తోంది. అందుకు చక్కటి ఉదాహరణలుగా మండల పరిధిలోని కుచ్చర్‌కల్, రాయపల్లి, మల్లేపల్లి, తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను చెప్పవచ్చు. ఆయా పాఠశాలలు ఇప్పటికీ అభివద్ధి విషయంలో ఆమడదూరంలో ఉన్నాయి. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాల భవనాలు కూలడానికి సిద్ధంగా ఉండడంతో.. విద్యార్థులను బడులకు పంపించేందుకు తల్లిదండ్రులు జంకుతున్నారు. ముఖ్యంగా కుచ్చర్‌కల్ ప్రాథమికోన్నత పాఠశాల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. పాఠశాలలో మొత్తం ఏడు తరగతులకు గానూ మూడు తరగతి గదులు ఉన్నాయి. వాటిలో పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. దీనికి తోడు రోడ్డు పక్కనే పాఠశాల ఉంది. కనీసం ప్రహరీ కూడా లేదు. ఇక మౌలిక వసతుల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. దీంతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవస్థలు తప్పేలా లేవు. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో తాత్కలిక మరమ్మతు ప్రస్తుతం చేపడుతున్నప్పటికీ.. అవి ఏమేరకు రక్షణ ఇవ్వగలవనేది సందేహాస్పదంగా మారింది. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వసతులతో పాటు నూతన భవనాన్ని, ప్రహరీని నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పెచ్చులూడుతున్న పై కప్పు



ఎప్పుడో నిర్మించి అసంపూర్తిగా వదిలేసిన తరగతి గది

భయం భయంగా..



పాఠశాలలోని మేం కూర్చునే గది పైకప్పు పెచ్చులు ఊడిపడుతోంది. ఎప్పుడు మీద పడుతుందో అని భయం భయంగా గడుపుతున్నాం. నూతన భవనాన్ని నిర్మిస్తే బాగుంటుంది.

– అక్షిత, ఏడోతరగతి, కుచ్చర్‌కల్ యూపీఎస్

వర్షం వస్తే ఇబ్బందే..



చిన్న వర్షం వచ్చినా తరగతి గదులు అన్ని కురుస్తాయి. గోడలకు ఏవైనా పోస్టర్‌లు అంటించినా అవి ఊడిపోతాయి. ఎక్కడైన నిలబడదామన్న పైకప్పు కురుస్తుండటంతో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చాలా సంవత్సరాలక్రితం నిర్మించిన గదులు అన్ని ఎప్పుడు కూలుతాయో అని భయంగా ఉంది.

– హెప్సిబా, ఉపాధ్యాయులురాలు, కుచ్చర్‌కల్ యూపీఎస్

నూతన భవనం నిర్మిస్తే మేలు



పాఠశాల తరగతి గదులు చూస్తే చాలా భయంగా ఉంది. వర్షం వస్తే కొన్ని సార్లు పాఠశాలను తెరవలేని పరిస్థితి ఉంది. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. కానీ దానివల్ల పెద్దగా ఉపయోగం లేదు. మరమ్మతు చేసినా వృథాయో అనిపిస్తోంది. కొత్త భవనాలు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉన్నతాధికారులకు సైతం పాఠశాల వాస్తవ పరిస్థితులను విన్నవించాం.

– సమతాదేవి, హెచ్‌ఎం, కుచ్చర్‌కల్ యూపీఎస్

ఆలయ స్థలాన్ని ఆక్రమించారని ఆందోళన



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కొండేడ్ గ్రామస్తులు

జడ్చర్ల: ఆలయ స్థలాన్ని ఆక్రమించారంటూ కొండేడ్ గ్రామస్తులు జడ్చర్ల మండల పరిషత్ కార్యాలయానికి శనివారం పెద్దఎత్తున తరలివచ్చి ఆందోళన చేపట్టారు. గ్రామస్తుల కథనం మేరకు.. కొండేడ్‌లో 2017లో అప్పటి సర్పంచ్ యాదమ్మ ఆధ్వర్యంలో గ్రామంలోని సర్వేనంబర్ 202లో ప్లాటు నంబర్ 9లో ఉన్న స్థలాన్ని రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి కేటాయిస్తూ తీర్మానం చేశారు. ఈ మేరకు హద్దులు నిర్ణయించారు. కాగా పక్కనే 60 చ.గజాల స్థలాన్ని కొనుగోలు చేసిన చెన్నయ్య తప్పుడు కాగితాలు సృష్టించి.. ఆలయానికి కేటాయించిన స్థలాన్ని కూడా తన స్థలంలో కలుపుకొని ఇంటి నిర్మాణం చేపట్టేందుకు సిద్ధమయ్యాడు. ఈమేరకు పంచాయతీ కార్యదర్శి కూడా అనుమతి మంజూరు చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. తాము గుడి స్థలంలో కొంతమేర బేస్‌మెంట్ కూడా నిర్మించామని ఆక్రమణదారుడు అది కనిపించకుండా మట్టినింపి చదును చేశాడని ఆరోపించారు. విషయంపై ఎంపీడీఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేరు చెప్పి తప్పించుకుంటున్నారని పేర్కొన్నారు. పైగా తమపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయిస్తామంటూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. న్యాయం జరిగేంత వరకు కదలబోమని శనివారం ఎంపీడీఓతో వాగ్వాదానికి దిగారు. ఎంపీడీఓ చాంబర్‌లో బైఠాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విషయాన్ని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కాగా ఆయన సైతం ఎంపీడీఓ వెంకటప్రసాద్‌తో మాట్లాడారు. కాగా ఆందోళన నేపథ్యంలో అధికారులు దిగివచ్చారు. ఆక్రమిత స్థలం గుడికే కేటాయిస్తున్నట్లు తీర్మానం రాయించి గ్రామస్తులకు అందజేశారు. దీంతో వారు హర్షం వ్యక్తం చేశారు.

క్రాసింగ్ లేక వాహనదారుల ఇబ్బందులు



కాటవరం తండా స్టేజీ వద్ద పరిస్థితి ఇలా..

అడ్డాకుల: మండలపరిధిలో 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి కాటవరం తండాకు వెళ్లే దారి వద్ద రోడ్డు క్రాసింగ్ లేకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాటవరం తండా గిరిజనులు అడ్డాకుల నుంచి వచ్చే సమయంలో కాటవరం స్టేజీ నుంచి హైవేపై రాంగ్‌రూట్లో సుమారు అర కిలోమీటర్ దూరం రాకపోకలు సాగిస్తున్నారు. అడ్డాకుల నుంచి వచ్చే వాహనాలు గుడిబండ స్టేజీ వద్దకు వెళ్లి అక్కడ యూటర్న్ తీసుకుని తిరిగి తండా స్టేజీ వరకు రావాల్సి ఉంది. అయితే తండా స్టేజీ నుంచి గుడిబండ స్టేజీ దూరంగా ఉండటంతో.. వాహనదారులు కాటవరం స్టేజీ నుంచి తండా స్టేజీ వరకు రాంగ్‌రూట్లో వాహనాలను తీసుకెళ్తున్నారు. రాత్రివేళ కూడా రాంగ్‌రూట్లో వాహనాలు రావడం వల్ల ప్రధాన రోడ్డుపై వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో ఇక్కడ రోడ్డు క్రాసింగ్‌ను ఏర్పాటు చేయాలని గిరిజనులు రహదారి నిర్వాహకులను కోరినా ఏర్పాటు చేయడం సాధ్యం కాదని వారు తేల్చి చెప్పారు. ఇదిలా ఉండగా కనీసం కాటవరం స్టేజీ నుంచి రాంగ్‌రూట్లో వాహనాలు రాకుండా గుడిబండ స్టేజీ వరకు వెళ్లి తిరిగి వచ్చేలా వాహనదారులను చైతన్యం చేయాల్సిన అవసరముంది.

పాఠశాలను సందర్శించిన ఎంపీ



దేవరకద్ర: చిన్నరాజమూర్‌లోని ప్రాథమిక పాఠశాలను ఎంపీ డీకే అరుణ శనివారం సందర్శించారు. గ్రామానికి వచ్చేదారిలో ఉన్న పాఠశాలలో వసతులను పరిశీలించారు. విద్యాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కాగా ఆమెను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు తిప్పారెడ్డి, లక్ష్మీనారాయణ, నాయకులు కొండ ప్రశాంత్‌రెడ్డి, నారాయణరెడ్డి, కృష్ణంరాజు, దేవన్న, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి



సీఎండీ ముషరాఫ్ అలీ ఫారూఖీకి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సెక్రటేరియేట్‌లో టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషరాఫ్ అలీ ఫారూఖీని కలిసి చర్చించారు. నియోజకవర్గంలో నూతన సబ్‌స్టేషన్‌ల ఏర్పాటుతో పాటు సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్యలు, కొత్త సబ్‌స్టేషన్‌లకు సంబంధించిన వివరాలను సీఎండీకి అందజేశారు. అదేవిధంగా సెక్రటేరియేట్‌లో రాష్ట్ర ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ అనిల్‌కుమార్‌ను ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కలిసి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, కొత్తగా చేపట్టబోయే పనులపై చర్చించారు. ఇరిగేషన్‌కు సంబంధించిన పనులన్ని వెంటనే పూర్తి చేయాలని కోరారు.

కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలి



వినతిపత్రం సమర్పిస్తున్న కార్మికులు

జడ్చర్ల టౌన్: రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించే పీఆర్సీలో మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలుగా పెంచాలని.. మున్సిపల్‌వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు దశలవారి పోరాటాల్లో భాగంగా వినతిపత్రం సమర్పించామని తెలిపారు. అలాగే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సేవలను థర్డ్‌పార్టీకి అప్పజెప్పాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు విజయ్‌కుమార్, కృష్ణ, యాదయ్య, కరీం, అంజమ్మ, విద్యాసాగర్, దేపల్లి రాజు, నర్సింములు, ఇందిరమ్మ, స్వరూప, సరిత, భీమమ్మ, కొండమ్మలు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ రూరల్: 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్, జేఈఈ, నీట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లాలోని ఎరుకల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నారు. ఈమేరకు వారిని ప్రోత్సహించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు జిల్లా ఎరుకల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోట వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి వి.పర్వతాలు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీలోపు విద్యార్థులు ప్రతిభా పురస్కారాల కోసం 9912984375, 7981994426 నంబర్‌లను సంప్రదించాలని కోరారు.

కేబినెట్‌లో ముస్లింలకు ప్రాతినిధ్యం కల్పించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర కేబినెట్‌లో ముస్లింలకు ప్రాతినిధ్యం కల్పించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ అంటూ పలికిన పలుకులు ఆచరణలో ఏమయ్యాయని ప్రశ్నించారు. ముస్లిం మైనార్టీలకు ప్రాతినిధ్యం లేని తొలి కేబినెట్ ఇదేనని తెలిపారు. 14 నుంచి 16 శాతం ఉన్న ముస్లిం సామాజిక వర్గాన్ని మంత్రి వర్గంలోకి తీసుకోకపోవడం సరికాదన్నారు. దేశంలో 1952 నుంచి ఎన్నికలు జరుగుతున్నాయని, ప్రతి కేబినెట్‌లోనూ ముస్లిం మైనార్టీలకు ప్రాతినిధ్యం లభించిందన్నారు. ముస్లిం మైనార్టీలపై రాజకీయ కక్షసాధింపులో భాగంగా ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

మహమ్మదాబాద్: నారాయణపేట్ జిల్లా ఉట్కూరు మండలం చిన్నపొర్లలో భూ తగాదాలతో హత్యకు గురైన వ్యక్తి కుటుంబాన్ని.. ప్రభుత్వం అన్నిరకాలుగా ఆదుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. హత్యకు గురైన వ్యక్తి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పురావృతం కాకుండా ప్రభుత్వం సమాజానికి కనువిప్పు కలిగేలా చర్యలు చేపట్టాలన్నారు. మండలానికి చెందిన వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

నవాబుపేట: మండలపరిధిలో ఓ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ప్రమాదకరంగా మారి.. అటుగా వెళ్లే వారిని ఆందోళనకు గురిచేస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. గుబ్బడిగుచ్చ తండాలో ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె శిథిలమై ఉంది. ప్రమాదానికి చేరువలో ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పైగా గ్రామానికి, రోడ్డుకు దగ్గరగా ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. విషయంలో వెంటనే స్పందించి దిమ్మె మరమ్మత్తు చేయాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.



శిథిలావస్థలో ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

ఇలా ఉంటే.. ఎలా వెళ్లేది?



ఎస్ఆర్ నగర్ సమీపంలో రోడ్డుపై పేరుకుపోయిన మట్టి, పెద్ద బండరాళ్లు



ధనలక్ష్మీకాలనీలో మిషన్ భగీరథ కోసం రోడ్డుకు అడ్డంగా తవ్విసరిగా పూడ్చని మట్టి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో ఇటీవల స్థానికుల కోరిక మేరకు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు వివిధ వార్డులలో మిషన్ భగీరథ పథకం పైపులైన్లను పొడిగించారు. అలాగే అక్కడక్కడా ఏర్పడుతున్న లీకేజీలను సైతం సరిచేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఆయా చోట్ల గుంతలు తవ్వి ఆ తర్వాత సరిగా పూడ్చివేయడం లేదు. కొన్ని చోట్ల రోడ్లపై అడ్డంగా మట్టి అడుగు లోతుకు దిగబడింది. మరికొన్ని చోట్ల రోడ్డుకు రెండు అడుగుల ఎత్తుకు మట్టితోపాటు పెద్ద బండరాళ్లు నింపి అలాగే వదిలేశారు. ఇదిలా ఉండగా నాలుగేళ్ల క్రితం మిషన్ భగీరథ పథకం కోసం మొత్తం 49 వార్డులలో పైపులైన్లు వేశారు. కాగా, ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చినప్పుడు రోడ్లపై ఎక్కడికక్కడ గుంతలు తవ్వి సరిగా పూడ్చలేదు. అసలే వర్షాకాలం.. ఆపై చీకట్లో వీధి లైట్లు వెలగకపోవడంతో గుంతల దగ్గరకు వచ్చేసరికి ఆగిపోవాల్సి వస్తోంది.

పెద్దనాలాలో పూడికతీత పనులు



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 14, 28వ వార్డుల మధ్యలో నుంచి వెళ్లే పెద్దనాలాలో కొనసాగుతున్న పూడికతీత పనులను శనివారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వరదనీరు ఎక్కడా ఆగకుండా ముందుకు వెళ్లేలా అన్ని పాటుకాల్వలు, పెద్దనాలాలలో పేరుకుపోయిన పూడికను తొలగిస్తున్నామన్నారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు చేరకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గురులింగం తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ చైర్మన్ పదవి ముదిరాజ్‌లకే కేటాయించాలి

కొత్తకోట రూరల్: రాష్ట్ర మత్స్య సహకార కార్పొరేషన్ చైర్మన్‌గా ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నియమించాలని కొత్తకోట మండల ముదిరాజ్ సంఘం నాయకులు రాజమౌళి సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఉన్న 5వేల చేపల సహకార సంఘాల్లో 4,300కు పైగా సంఘాల్లో ముదిరాజులే ఉన్నారని, కేవలం 700సంఘాలు కలిగిన బేస్త కులస్తుల వారిని చైర్మన్‌గా నియమించడం సరికాదన్నారు.

పండుగలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

జడ్చర్ల: ప్రజలందరూ పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని స్థానిక సీఐ ఆదిరెడ్డి తెలిపారు. శనివారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో బక్రీద్ పండుగను పురస్కరించుకుని శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పండుగలను ఏ మతానికి చెందిన వారయినా సంతోషంగా ఎలాంటి మతవిద్వేషాలను రెచ్చగొట్టకుండా, కవ్వింపు చర్యలకు పాల్పడకుండా నిర్వహించుకోవాలన్నారు. ఎస్‌ఐలు చంద్రమోహన్, శివానందంగౌడ్, అశోక్‌బాబు ఆయా సంఘాల నాయకులు జగ్‌పాల్‌రెడ్డి, యాసిర్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెరిగితేనే జీవుల మనుగడ



మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం, తదితరులు

కోస్గి: భూమిపై విస్తారంగా పచ్చదనం పెరిగితేనే జీవుల మనుగడ సాధ్యమని ముశ్రీఫా జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శేఖరయ్య అన్నారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు శనివారం పాఠశాలలో పర్యావరణ వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మానవాళి ప్రాణాలు కాపాడే గాలి, నీరు, ఆహారం, ప్రకృతి ద్వారానే లభిస్తుందన్న విషయం గుర్తించుకోవాలని హెచ్‌ఎం సూచించారు. అంతకుముందు విద్యార్థులకు ప్రకృతి నడక అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏకో ఎర్త్ క్లబ్ కో–ఆర్డినేటర్ వార్ల మల్లేశం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

జడ్చర్ల: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. శనివారం నసరుల్లాబాద్, చర్లపల్లి, కిష్టంపల్లి గ్రామాల్లో కూలీలతో మాట్లాడారు. ఆరు మాసాలుగా కూలీలు పనులు చేస్తున్నా అందుకు సంబంధించిన డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పనిదినాలను 150 రోజులకు పెంచాలని.. కనీసంగా రూ.400 కూలీ చెల్లించాలని అన్నారు. పనిముట్లు సరఫరా చేయాలని.. పనిప్రదేశంలో కనీస సౌకర్యాలు, బీమా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18న చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి మోహన్, మాసయ్య, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నవాబుపేట: తూక్యతండాలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి బీఆర్ఎస్ యువజన నాయకుడు అభిమన్యురెడ్డి విరాళం ప్రకటించారు. ఈమేరకు శనివారం తండాకు చెందిన ముఖ్య నాయకులతో పాటు మండల గిరిజన నాయకులు అడిగిన వెంటనే రూ. లక్ష అందజేశారు. ఈ సందర్భంగా గిరిజనులు ఆయనను ఘనంగా సన్మానించారు. రాంచంద్రనాయక్, మాజీ సర్పంచ్‌లు నర్సింహనాయక్, తరుణ్‌నాయక్, రాజు తదితరులు ఉన్నారు.